కోతల కాలం..

- మండల పరిధిలో చురుగ్గా ప్రారంభం
- అధిక దిగుబడినిచ్చిన బొండాలు
- కోత యంత్రాలకు పెరిగిన డిమాండ్

సామర్లకోట: మండల పరిధిలో దాళ్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో 22,250 ఎకరాల్లో వరి సాగు చేశారు. వీటిలో 85 శాతం బొండాలు సాగు చేయగా మిగిలిన భూముల్లో ఎంటీయూ 1153, 1121, 1156, 1153 ఆర్ఎస్ఆర్ 15048 రకాలను సాగు చేస్తున్నారు. ప్రతి పంటకు వ్యవసాయాధికారులు రోస్టర్ పద్ధతిలో కోత ప్రయోగాలు చేస్తున్నారు. వీటి ఆధారంగా సన్నాలు ఎకరానికి 45 నుంచి 50 బస్తాలు, బొండాలు 55 నుంచి 60 బస్తాలు దిగుబడి వస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. అయితే పీబీ దేవం గ్రామంలో 1153 సాగు చేసి కొంత మంది రైతులకు దిగుబడి తగ్గినట్లు గుర్తించామని వ్యవసాయాధికారులు తెలిపారు. కోతలకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో పాటు ప్రస్తుత దాళ్వా సాగులో నీటి ఎద్దడి లేకపోవడంతో రైతులు ఆనందంలో ఉన్నారు. వరి కోత యంత్రాలు అందుబాటులో ఉన్న రైతులు చురుగ్గా కోతలు చేపట్టారు. మండల పరిధిలోని రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వరి కోత యంత్రాలను సబ్సిడీపై ఇవ్వడంతో గురువారం నాటికి 2 శాతం వరి కోతలు జరిగినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కోతల సమయం కావడంతో యంత్రాలకు డిమాండ్ పెరిగి ధర పెంచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి కోతలు పూర్తి అయితే గోదావరి కాలువను కట్టేస్తారు. దాంతో పంట పొలాలకు సాగు నీరు ఉండదు. మండల పరిధిలో 95 శాతం వరకు గోదావరి కాలువపై ఆధారపడి సాగవుతోంది. మిగిలిన రైతులు ఏలేరు కాలువ బోర్ల ద్వారా సాగు చేసుకుంటున్నారు. గోదావరి కాలువ కట్టేసే ముందు రైతులు తమ పొలాలకు సాగు నీటిని నింపుతారు. ఆ నీటితో రైతులు అపరాల సాగుకు సిద్ధమవుతారు. కొందరు రైతులు పంట భూముల సారవంతానికి పచ్చిరొట్టను సాగు చేసి దుక్కి చేస్తారు. నకిలీ విత్తనాల బెడదతో రైతులు నష్టపోవలసి వస్తుందని అభిప్రాయపడుతున్నారు. మండల పరిధిలో 21 రైతు భరోసా కేంద్రాలు ఉండగా 15 కేంద్రాలలో మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు సరికాదని అభిప్రాయపడుతున్నారు. 15 రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభం కాగా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.



వేట్లపాలెంలో వరి కోత యంత్రం నుంచి వస్తున్న ధాన్యం



పొలంలోనే ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

వాతావరణం అనుకూలించింది



ప్రస్తుత దాళ్వా సీజన్‌లో రైతులు ఎక్కువగా బొండాలు సాగు చేశారు. పీబీదేవం ఎత్తిపోతల పథకం పరిధిలోని రైతులకు సమృద్ధిగా నీరు అందింది. అందుబాటులో యంత్రాలు ఉండటంతో చురుగ్గా కోతలు సాగుతున్నాయి. ప్రభుత్వ అధికారులు అనుమతి ఇచ్చిన ఏజెన్సీ నుంచి కొనుగోలు చేసిన విత్తనాలు నకిలీ కావడంతో ఎకరానికి 20 బస్తాలకు మించి దిగుబడి రాలేదు. శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి 10 రోజులు అవుతున్నా నివేదిక రాలేదు. ధాన్యం త్వరగా కొనుగోలు చేసి సొమ్ములు వేగంగా వారి ఖాతాల్లో వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మలకల వరాలబాబు, సొసైటీ అధ్యక్షుడు, పీబీ దేవం

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం



మండల పరిధిలో ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. జి.మేడపాడులో గురువారం సాయంత్రం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించాం. ఎండలు ఎక్కువగా ఉండటం వలన ధాన్యంలో తేమ శాతం సమస్య ఉండదు. మండలంలో బొండాలు 85 శాతం సాగు చేశారు. 80 శాతం మంది వెదజల్లు పద్ధతిలో సాగు చేయడం వలన పెట్టుబడి తగ్గే అవకాశం ఉంది. సార్వా సీజన్‌లో రైతులకు నాలుగు రోజులలోనే సొమ్ములు చెల్లించాం.

– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



ధాన్యం కొనుగోలు కేంద్రంలో సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ మీనా, ఇతర అధికారులు

- జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా
- జి.మేడపాడులో కేంద్రం ప్రారంభం

సామర్లకోట: రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలో జి.మేడపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు శుక్రవారం నుంచి పని చేస్తున్నాయని తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలోని నిబంధనలు తెలుసుకుని ధాన్యం విక్రయించాలన్నారు. తేమ శాతంతో పాటు రాళ్లు లేకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో ఈ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ధాన్యం విక్రయించిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ అయ్యేలా ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ జిల్లా చైర్మన్ తోట సుధీర్ మాట్లాడుతూ సాధారణ రకం 100 కేజీలు రూ.2,300, 75 కేజీలు రూ.1,725, గ్రేడ్–ఎ రకం 100 కేజీలు రూ.2,320, 75 కేజీలు రూ.1,740గా ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని గుర్తించే విధానంపై సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షత వహించగా, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్లు తుమ్మల పద్మజ, మోకా ఆనంద్‌సాగర్, కదలి ఈశ్వరి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ విజయ్‌కుమార్, జిల్లా సహకార అధికారి జి.వెంకటకృష్ణ, జిల్లా సివిల్ సప్లయ్స్ మేనేజరు ఎం దేవుల నాయక్, వ్యవసాయశాఖ ఏడీఏ రత్నప్రశాంతి, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్, ఎఓ ఐ.సత్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం మార్పు చేయనున్న ఐసీడీఎస్ కార్యాలయం భవనం పనులను అధికారులు పరిశీలించారు.

7న శృంగార వల్లభుని కల్యాణం

ఆహ్వాన పత్రికను విడుదల చేసిన ఎమ్మెల్యే రాజప్ప

పెద్దాపురం: స్వయంభూ తిరుపతి శృంగార వల్లభ స్వామి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్వామి కల్యాణోత్సవాల ఆహ్వాన పత్రికను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్, తిరుపతి గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, కొత్తెం కోటిలు ఎమ్మెల్యే చిన రాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజులకు అందజేశారు. అనంతరం ఆయనతో సమావేశమై ఉత్సవ ఏర్పాట్లను వివరించారు. ఈ నెల ఏడు నుంచి 13వ తేదీ వరకు కల్యాణోత్సవాలుంటాయని, 7వ తేదీన రాత్రి స్వామి దివ్య కల్యాణానికి రావాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులున్నారు.



ఎమ్మెల్యే రాజప్పకు కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈఓ, సర్పంచ్

చెత్త సేకరణపై విస్తృత ప్రచారం

పిఠాపురం: ఇంటింటికీ చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి విస్తృత ప్రచారం చేయాలని డీఎల్పీఓ అన్నామణి అధికారులకు సూచించారు. గురువారం గొల్లప్రోలు మండలంలో ఆమె పర్యటించి మాట్లాడుతు ఐవీఆర్ఎస్ కింద గొల్లప్రోలు మండలంలో నాలుగు గ్రామ పంచాయతీలను ఎంపిక చేశామన్నారు. వాటిలో చేబ్రోలు, తాటిపర్తి, ఎ.విజయనగరం, ఏపీ మల్లవరం గ్రామాలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ చెత్త సేకరణలో తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించడం, చెత్త నుంచి సంపద తయారు చేసే షెడ్లను సక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి తడి, పొడి చెత్త సేకరణపై పారిశుధ్య కార్మికులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారు చేసే షెడ్లను పరిశీలించారు. ఆమె వెంట ఈఓ పీఆర్‌డీ కుమార్, గ్రామ కార్యదర్శులు రాజు, శ్రీనివాసరావు తదితరులున్నారు.



చేబ్రోలులో చెత్త నుంచి సంపద తయారు చేసే షెడ్లను పరిశీలిస్తున్న డీఎల్పీఓ అన్నామణి

డ్రగ్స్‌తో ఉజ్వల భవితను కోల్పోవద్దు

- జిల్లా ఎస్పీ బిందుమాధవ్
- డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన

గండేపల్లి: విద్యార్థులు డ్రగ్స్ మాయలో పడి ఉజ్వల భవిష్యత్తును కోల్పోవద్దని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ సూచించారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ వద్దు బ్రో, శక్తి యాప్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, వాటిని వినియోగించినా, రవాణా చేసినా పడే శిక్షలను సెక్షన్లతో సహా వివరించారు. డ్రగ్స్ కేసులో నేరం రుజువైతే తప్పనిసరిగా శిక్షలు అనుభవించాల్సి ఉంటుందన్నారు. యువత సన్మార్గంలో నడవాలన్నారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. విపత్కర సంఘటనలు ఎదురైనప్పుడు కేవలం మొబైల్‌ను షేక్ చేయడం ద్వారా పోలీస్ అధికారుల రక్షణ లభిస్తుందని, ప్రతిఒక్కరూ శక్తి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చాన్సలర్ ఎన్.శేషారెడ్డి, ప్రో చాన్సలర్ ఎన్. సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ట్రైనింగ్ డీఎస్పీ సీహెచ్ జీవన, జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సై యువి శివనాగబాబు, పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో వీసీ తనిఖీ

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్ద గల నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌ను నన్నయ యూనివర్శిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్న శ్రీ గురువారం తనిఖీ చేశారు. క్యాంపస్ ఆవరణ, కార్యాలయాలను, వసతి గృహాలను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు, పనితీరును ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పీజీ అడ్మిషన్లు జరుగుతుండడంతో అన్ని కోర్సుల్లోని సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలని సూచించారు.

అపరిశుభ్రతపై సీరియస్

పీజీ సెంటరు సందర్శనలో భాగంగా వసతి గృహాన్ని సందర్శించి సిబ్బందిపై వీసీ ప్రసన్నశ్రీ సీరియస్ అయ్యారు. వసతి గృహాన్ని, మెస్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.



మెస్‌ను పరిశీలిస్తున్న నన్నయ వీసీ ప్రసన్న శ్రీ

తడి, పొడి చెత్త సేకరణపై ఆరా

కాకినాడ రూరల్: మండలంలోని గంగనాపల్లి, కొవ్వాడ గ్రామాల్లో డీపీఓ వి.రవికుమార్ గురువారం పర్యటించారు. రెండు గ్రామాలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు పలు సూచనలిచ్చారు. గృహస్తుల నుంచి తడి, పొడి చెత్తను రోజూ తీసుకుంటున్నారో లేదో క్లాప్ మిత్రలను అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్, చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పంచాయతీ కార్యదర్శులు చూడాలను సూచించారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, కర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గంగనాపల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

విద్యుత్ భారాలు తగ్గించాలి



విద్యుత్ భారాలకు నిరసనగా ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం భారీగా వేస్తున్న విద్యుత్ చార్జీలకు నిరసనగా సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం కాకినాడ ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన సంగతి మరిచారని ఆందోళనకారులు విమర్శించారు. అదానీకి లాభాలు చేకూర్చే సెకి ఒప్పందం రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎప్పుడో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరుతో భారాలు వేయడం దారుణమన్నారు. అలాగే టైం ఆఫ్ ది డే పేరుతో విద్యుత్ కీలకంగా ఉపయోగించే సమయాల్లో యూనిట్ ధర పెంచాలనే ప్రతిపాదన దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. అనంతరం ఈఈ ఉదయ్‌భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా సీనియర్ నేత దువ్వా శేషుబాబ్జీ, నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంత నవరాత్ర ఉత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో వసంత నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ అర్చకుడు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి విశేష అర్చనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుందరకాండ పారాయణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి →



స్మార్ట్ సిటీ గడువు పెంచాలి

బోట్‌క్లబ్: స్మార్ట్ సిటీ గడువు ముగిసిపోవడంతో పొడిగించే చర్యలకు కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడం అత్యంత విచారకరమని పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2016లో రూ.10 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ అవకాశం కల్పించినా ఐదేళ్లకు రూ.వెయ్యి కోట్ల పనులు మాత్రమే చేయడంతో పూర్తిస్థాయి స్మార్ట్‌సిటీ ఫలితాలు పొందలేదని, 2021లో రెండేళ్లు గడువు పొడిగించడం వల్ల మాజీ సీఎం జగన్ హయాంలో పెండింగ్ పనులు జరిగినప్పటికీ రూ. 180 కోట్లు పెండింగ్ నిధులు నేటికీ విడుదల కాలేదన్నారు. దేశంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు నిర్వహణ కొనసాగుతున్నందున కూటమి ప్రభుత్వం మరో రెండేళ్లు గడువు పొడిగించి విలీన గ్రామాలతో కార్పొరేషన్ ఎన్నికలు పూర్తి చేయించి ఆర్థిక సంఘం నిధులు వచ్చేలా కృషి చేయాలన్నారు.

క్లుప్తంగా

పాలిటెక్నిక్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



ప్రసంగిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు

పెద్దాపురం: పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ), భారత విద్యార్థి ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం ఉచిత శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో మిషన్ అన్నపూర్ణ సహాయనిధి రాజేష్‌కుమార్ దేవత, మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ నరేష్ పెద్దిరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు గోపాలకృష్ణ, టీడీపీ యువత కార్యదర్శి ఆరీఫ్ అలీ, పీఎస్ఎం నాయకులు రొంగల వీర్రాజు, నీలపాల మురళీకృష్ణ, పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్, అమృత తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఫ్యాకల్టీ బాధ్యతల స్వీకరణ



వి జగన్నాథం

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం(ఈటీసీ) జూనియర్ ఫ్యాకల్టీగా వి. జగన్నాథం గురువారం బాధ్యతలు స్వీకరించారు. విస్తరణ శిక్షణా కేంద్రంలో ఫ్యాకల్టీలు పూర్తి సంఖ్యలో ఉండాలనే ఆలోచనతో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తున్నారు. దీనిలో భాగంగా విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న జగన్నాథంను ఈటీసీకి బదిలీ చేశారు. దాంతో ఆయన జూనియర్ ఫ్యాకల్టీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు మరో ముగ్గురు జూనియర్ ఫ్యాకల్టీలు త్వరలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నదని ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీ సునీల తెలిపారు.

ఆర్భాట వేంద్రం!



మున్సిపల్ కార్యాలయం వద్ద ఖాళీగా దర్శనమిచ్చిన చలివేంద్రం

పెద్దాపురం: ప్రజల దాహార్తి తీర్చేందుకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో నేడు కేవలం షెడ్ మాత్రమే కనపడిది. మున్సిపల్ కార్యాలయ వద్ద గురువారం కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఏర్పాటు చేసిన ముఖాముఖికి వచ్చిన దరఖాస్తుదారులకు చుక్క నీరు లేక గొంతు తడుపుకోవడానికి సమీపంలోని దుకాణాల వద్దకు పరుగులు తీశారు. దరఖాస్తుదారుల కోసం కనీసం టెంట్ కూడా లేకుండా మండుటెండకు వారిని వదిలేయడం విమర్శలకు తావిచ్చింది. తాపం తాళలేక తాగునీటి కోసం పక్కనే ఉన్న చలివేంద్రానికి వస్తే అక్కడ ఖాళీ గ్లాసులు దర్శనమివ్వడం చర్చనీయాంశమైంది. కూటమి నేతలు, మున్సిపల్ అధికారులు ఆర్భాటాలు, ప్రగల్భాలు మాని కనీసం చలివేంద్రాల నిర్వహణైనా పూర్తి స్థాయిలో చూడాలని పుర ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పాడా పీడీ చైత్ర వర్షిణి

పిఠాపురం: నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పాడా పీడీ చైత్ర వర్షిణి గురువారం పరిశీలించారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో నిర్మాణంలో ఉన్న తహసీల్దారు కార్యాలయం, అన్న క్యాంటిన్, యూపీహెచ్‌సీ, వాటర్ వర్క్సును పరిశీలించిన ఆమె ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పిఠాపురం ఎస్సీ వసతి గృహాన్ని ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్ర, శనివారాల్లో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. ఈమె వెంట ఏపీడీ వసంత మాధవి పలువురు అధికారులు ఉన్నారు.

విగ్రహాలకు విశిష్ట పూజలు

కరప: స్థానిక నీలయ్యతోట వీధిలో పునర్నిర్మించిన రామాలయంలో ప్రతిష్ఠించనున్న సీతా రామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలకు గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాతలు లకమన బాబూరావు కుటుంబ సభ్యులు వియత్నాం దేశం నుంచి రూ.3 లక్షలు విలువచేసే స్వామివార్ల పాలరాతి విగ్రహాలను తీసుకొచ్చి ఆలయానికి సమర్పించారు. వేదపండితులు కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం, మణికంఠల ఆధ్వర్యంలో వేదపండితులు గురువారం ఉదయం విఘ్నేశ్వరపూజ, సర్వతోభద్ర మండపారాధన, దేవత హోమాలు, క్షీరాధివాసం తదితర పూజలు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ నుంచి ఇద్దరి సస్పెన్షన్

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సీపీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఇద్దరిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణ మూర్తి, సామర్లకోట మండలానికి చెందిన ఎలిశెట్టి సూర్యనారాయణమూర్తి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పార్టీ క్రమ శిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటాం

మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెడితే ఎదుర్కొంటానని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. గురువారం ఆమె స్వగృహంలో భర్త గంగిరెడ్డి కృష్ణమూర్తితో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ బుధవారం 22 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి బలనిరూపణకు అవకాశం ఇవ్వాలని కలెక్టరు, మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రాలు అందజేయడంతో చైర్‌పర్సన్ స్పందించారు. చైర్‌పర్సన్ పదవి ఇచ్చే సమయంలో వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ తల్లికి చైర్‌పర్సన్ ఎప్పుడు ఇస్తే అప్పుడు తన పదవికి రాజీనామా చేస్తానని హామీ ఇచ్చానని, దవులూరి పార్వతి చైర్‌పర్సన్ అని తనకు ఒకమాట చెప్పితే రాజీనామా చేయడానికి ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. అయితే తనను దింపి మరొకరికి చైర్‌పర్సన్ పదవి ఇవ్వడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. చైర్‌పర్సన్‌గా స్థానిక ఎమ్మెల్యే చేస్తున్న కార్యక్రమాల్లో పాల్గొడం తప్పా అని ఆమె ప్రశ్నించారు.

నేడు బీసీ కార్పొరేషన్ దరఖాస్తుల పరిశీలన

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో బీసీ కార్పొరేషన్‌కు వచ్చిన దరఖాస్తులను శుక్రవారం పరిశీలించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ–ఎ, బి, సి, డి, ఈలకు చెందిన వారు వివిధ యూనిట్లు, జనరిక్ మెడికల్ షాపుల కోసం దరఖాస్తు చేసిన వారు శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక టీటీడీసీకి హాజరు కావాలన్నారు. ఈ పరిశీలనకు వివిధ బ్యాంకుల అధికారులు, బీసీ కార్పొరేషన్ అధికారులు హాజరవుతారని, దరఖాస్తులు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే కాపు, కమ్మ, బ్రాహ్మణ, ఈబీసీ, ఆర్యవైశ్య కార్పొరేషన్ల వారికి, మేదరి, శాలివాహన, కుమ్మరి వారికి ఈ నెల ఏడో తేదీన టీటీడీసీలో దరఖాస్తుల పరిశీలన ఉంటుందన్నారు. దరఖాస్తుల పరిశీలనకు వచ్చే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారం, మూడు జెరాక్స్ కాపీలు, రేషన్ కార్డు మూడు, ఆధార్‌కార్డు మూడు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా మూడు కాపీల జెరాక్సులు తీసుకురావాలని కోరారు.

18 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

సామర్లకోట: మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అటువంటి వారిని గుర్తించాలని ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలు, డీఎస్పీ ఉత్తర్వుల మేరకు గురువారం 18 మందిని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో గుర్తించి కాకినాడ కోర్టుకు హాజరుపరిచారు. ఈ మేరకు సీఐ కె.కృష్ణభగవాన్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15 మందికి మూడు రోజుల జైలు, మరో ముగ్గురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జడ్జి డి.శ్రీదేవి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

బీచ్ అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



సూర్యారావుపేటలో బీచ్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ రూరల్: సూర్యారావుపేట బీచ్‌లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కలెక్టరు షణ్మోహన్ ఆదేశించారు. గురువారం ఆయన ఎమ్మెల్యే నానాజీతో కలసి పనులను పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అసౌకర్యం కలగకుండా మెరుగైన సౌకర్యాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధి చేపట్టిందన్నారు. ప్లాస్టిక్, తూటు, పిచ్చి మొక్కలు తొలగించి క్లీన్ అండ్ గ్రీన్‌గా బీచ్ పార్కు ఉండేలా చూడాలని కౌడా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ఇన్‌చార్జి అధికారి చైత్ర వర్షిణి, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత, ఏపీడీటీసీ ఏఈ వెంకటేష్, కౌడా ఈఈ రామారావు, జిల్లా పంచాయతీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

భావనారాయణుని దర్శించిన కలెక్టర్

సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయాన్ని కలెక్టర్ షణ్మోహన్ గురువారం సందర్శించారు. ఆయనకు దేవదాయ శాఖ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు.

వికాసలో 7న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస, పిఆర్ గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ, కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల ఏడో తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేళాలో ఐటీసీ లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్‌లో ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. పై ఉద్యోగాలకు ఐటీఐ, ఇంటర్ (ఒకేషనల్) ఉత్తీర్ణులైన 29 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.11 వేల నుంచి రూ. 19,659 వరకు జీతం, బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఏడో తేదీన పీఆర్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావచ్చన్నారు.